హైదరాబాద్ తరలిన బీఆర్ఎస్వీ నేతలు

బీఆర్ఎస్వీ నాయకులకు బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్వీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి బాల్కొండ నియోజకవర్గంలోని బాల్కొండ, మోర్తాడ్, భీమ్‌గల్ మండలాలకు చెందిన బీఆర్ఎస్వీ నాయకులు తరలివెళ్లారు. ఈసందర్భంగా అక్కడ జిల్లాల వారీగా విద్యార్థుల పేర్లు నమోదు చేసుకుంటున్న స్టాల్స్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరిశీలించి, బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్వీ నాయకులకు బుక్‌లెట్లను అందజేశారు.

– మోర్తాడ్, అక్టోబర్ 17

బోధన్‌లో మౌనదీక్ష

- కొనసాగిన ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

బోధన్‌లోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మౌనదీక్ష చేపట్టిన ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల కరెస్పాండెంట్లు, అధ్యాపకులు

బోధన్, అక్టోబర్ 17: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు చేపట్టిన నిరసన కార్యక్రమాలు జిల్లాలో గురువారం కొనసాగాయి. ఇందులో భాగంగా బోధన్‌లోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల కరెస్పాండెంట్లు, డైరెక్టర్లు, అధ్యాపకులు, పలువురు విద్యావేత్తలతో కలిసి గురువారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి నోటికి నల్లగుడ్డలు కట్టుకొని మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు మాట్లాడుతూ.. డస్టర్, సుద్దముక్కతో విద్యాబోధన చేసే తాము రోడ్లపైకి వచ్చి విద్యార్థులను ఇబ్బంది పెట్టడం లేదన్నారు. కళాశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడంతో అధ్యాపకులకు సైతం వేతనాలు అందించని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వారు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్ కలెక్టర్ వికాస్‌మహతోకు అందజేశారు. వివిధ ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బంద్.. తాత్కాలిక విరమణ

ఖలీల్‌వాడి, అక్టోబర్ 17: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ తదితర విషయాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇచ్చిన స్పష్టమైన హామీ మేరకు ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల బంద్‌ను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు తెలంగాణ డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం నాగేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు హరి ప్రసాద్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎంతోపాటు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశాన్ని కలిసి వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం నుంచి డిగ్రీ, పీజీ కళాశాలలు యథావిధిగా కొనసాగుతాయని వారు తెలిపారు.

ఎస్సీ, బీసీ నేతలకు మొండి చేయి

- వెనుకబడినోళ్లకు కాంగ్రెస్ ధోకా
- టికెట్ల నుంచి పదవుల పంపకం దాకా తీరని అన్యాయం
- నామినేటెడ్ పోస్టుల్లో అగ్రవర్ణాలకే పెద్దపీట
- ఉమ్మడి జిల్లాలో ఒక్క ఎస్సీకి దక్కని గుర్తింపు
- బీసీ నాయకులకు సైతం నిరాశే మిగిల్చిన అధిష్టానం
- 'హస్తం'లో అసంతృప్త జ్వాలలు
- నిరాశలో వెనుకబడిన వర్గాల నేతలు



టికెట్ల కేటాయింపులోనూ అంతే..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మొత్తం 9 నియోజకవర్గాలున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్సీ రిజర్వుడు స్థానం జుక్కల్‌ను మినహాయిస్తే మిగిలిన చోట్ల కాంగ్రెస్ సామాజిక సమతూకం పాటించలేదు. మైనార్టీ నేత షబ్బీర్ అలీని ఆయన సొంత నియోజకవర్గమైన కామారెడ్డి టికెట్ ఇవ్వలేదు. అప్పటికప్పుడు అర్బన్ నియోజకవర్గం నుంచి బరిలోకి దింపడంతో ఆయన ఓడిపోవాల్సి వచ్చింది. మిగిలిన ఏడు చోట్లా కాంగ్రెస్ అగ్రవర్ణాలకే అవకాశమిచ్చింది. బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన అగ్రవర్ణ నేతలకు కాంగ్రెస్ పార్టీ నిలబెట్టడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ నేతల ఆశలపై నీళ్లు చల్లింది. నిజామాబాద్ లోక్‌సభ పరిధిలోని జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లోనూ అగ్రవర్ణాలకే పెద్దపీట వేశారు. చివరకు లోక్‌సభ ఎన్నికల్లోనూ నిజామాబాద్‌లో రెడ్డి సామాజిక వర్గానికే అవకాశమిచ్చింది. అయితే బీఆర్ఎస్ మాత్రం నిజామాబాద్, జహీరాబాద్ నుంచి బీసీ నేతలను పోటీలో నిలబెట్టి వెనుకబడిన వర్గాలను ఆదరించింది. అదే సమయంలో టికెట్ల కేటాయింపు నుంచి పదవుల పంపకం దాకా కాంగ్రెస్ వివక్ష చూపిస్తుండడంతో ఎస్సీ, బీసీ నేతల్లో తీవ్ర నైరాశ్యం నెలకొన్నది.

నిజామాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : దళిత, వెనుకబడిన వర్గాలకు కాంగ్రెస్ మొండి'చేయి' చూపింది. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని కష్టపడి పని చేస్తున్న ఎస్సీ, బీసీ నేతలకు అన్యాయం చేయడం హస్తం పార్టీకి రివాజుగా మారింది. టికెట్ల కేటాయింపు నుంచి మొదలుకుని నామినేటెడ్ పదవుల వరకు అన్నింట్లోనూ వెనుకబడిన వర్గాలకు అధికార పార్టీ చేయిచ్చింది. మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో అగ్రవర్ణాలకే ప్రాధాన్యమిచ్చిన కాంగ్రెస్.. ప్రభుత్వంలోకి వచ్చాక పదవుల భర్తీలోనూ అదే ఒరవడి కొనసాగించింది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల్లో ఒక్క దళితుడికి అవకాశం కల్పించలేదు. ఒకరిద్దరు బీసీలకు నామమాత్రపు పదవులు కట్టబెట్టి మమ అనిపించడంతో అధికార పార్టీకి చెందిన దళిత, వెనుకబడిన వర్గాల నేతల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

దళితులకు దక్కని గుర్తింపు..

కీలకమైన గ్రంథాలయ చైర్మన్ పోస్టులను కాంగ్రెస్ రెండు జిల్లాల్లో ఒకే వర్గానికి కట్టబెట్టి బడుగు, బలహీన వర్గాలను పక్కన పెట్టింది. మార్కెట్ కమిటీ పదవుల భర్తీలోనూ ఇదే తీరు కనిపించింది. దీంతో చాలా మంది పార్టీ నేతలు అసంతృప్తికి లోనవుతున్నారు. డైరెక్టర్ పదవులకే తమను పరిమితం చేశారని వాపోతున్నారు. నిజామాబాద్‌లో నుడా చైర్మన్‌గా బీసీ నేతకు పదవిని అప్పగించారు. డైరెక్టర్ల నియామకంలో దళిత, గిరిజనులకు సమన్యాయం దక్కుతుందా.. లేదా? అన్నది చర్చనీయాంశమైంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు దళిత జాతికి ఒక్క పదవి వరించక పోవడంతో ఆయా వర్గాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఎస్టీ వర్గానికి చెందిన నేతల్లో ఒకరికి మాత్రమే ఐడీసీఎంఎస్ పదవిని కట్టబెట్టి మమ అనిపించారు. డీసీసీబీ వైస్ చైర్మన్ పదవి భర్తీ చేయాల్సి ఉండగా రాజకీయ సమీకరణాలతో వాయిదా వేస్తున్నట్లు తెలిసింది.

అగ్రవర్ణాలకే..

ఇప్పటివరకు జరిగిన నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఉమ్మడి జిల్లాకు ఐదు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు దక్కాయి. ఇందులో ఇద్దరు అగ్రవర్ణాలకు చెందిన వారు ఉండగా, ఇద్దరు బీసీలు, మైనార్టీ నేత ఒకరు ఉన్నారు. దళిత వర్గానికి చెందిన వారికి అసలు ప్రాధాన్యమే దక్కలేదు. ఇక, కీలకమైన గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవులను సైతం అగ్రవర్ణాల వారికే కాంగ్రెస్ కట్టబెట్టింది. ఆయా పోస్టులకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన బీసీ, దళిత వర్గాలకు చెందిన ముఖ్య నాయకులంతా పోటీ పడ్డారు. పార్టీని నమ్ముకుని పనిచేసిన వారంతా హైదరాబాద్‌లో కీలక నేతల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సీన్ కట్ చేస్తే రెండుచోట్ల ఒకే సామాజిక వర్గానికి చెందిన నేతలకు పదవులు కట్టబెట్టారు.

కేసీఆర్ హయాంలోనే సామాజిక న్యాయం

బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం లభించింది. అప్పట్లో బీసీలకే గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవులను కట్టబెట్టారు. కామారెడ్డి గ్రంథాలయ చైర్మన్‌గా ఒకసారి గౌడ సామాజికవర్గానికి, మరోసారి పద్మశాలీ వర్గానికి చెందిన నేతకు అవకాశమిచ్చారు. నిజామాబాద్‌లోనూ పద్మశాలీ బిడ్డకు గ్రంథాలయ సంస్థ బాధ్యతలు అప్పగించారు. మైనార్టీ కమిషన్ చైర్మన్‌గా తారీఖ్ అన్సారీకి, రెడ్‌కో చైర్మన్‌గా అలీకి బీఆర్ఎస్ అవకాశం కల్పించింది. ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా ముజీబుద్దీన్‌ను గౌరవించింది. బీసీ బిడ్డ బాజిరెడ్డిని ఆర్టీసీ చైర్మన్‌గా, దళిత వర్గానికి చెందిన డా.మధుశేఖర్‌కు కీలకమైన కార్పొరేషన్ పదవిని అప్పగించింది. జిల్లాకు చెందిన దళిత మేధావి ప్రొ.లింబాద్రిని ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా నియమించింది. మున్నూరుకాపు వర్గానికి చెందిన ఆకుల లలితను సైతం ఆదరించి ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా, మహిళా కమిషన్ సభ్యురాలిగా సూదం లక్ష్మికి కేసీఆర్ అవకాశం కల్పించారు. నియామకాల్లో బీఆర్ఎస్ అందరినీ గౌరవించగా, కాంగ్రెస్‌లో అలాంటి సమీకరణలు కనిపించడం లేదని హస్తం నేతలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ నాయకుల పేర్లేంటి?

- బీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆగ్రహం
- కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ నిలదీత

మున్సిపల్ కమిషనర్‌ను నిలదీస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కామారెడ్డి రూరల్ , అక్టోబర్ 17: ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఏర్పాటు చేసిన వార్డు స్థాయి కమిటీల్లో తాము ఇచ్చిన పేర్లు కాకుండా కాంగ్రెస్ నాయకుల పేర్లను చేర్చడంపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై వారు మున్సిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్ సుజాతను నిలదీశారు. ఇందిరమ్మ కమిటీలో స్థానిక కౌన్సిలర్ చైర్మన్‌గా, స్వయంసహాయక సంఘాల నుంచి ఇద్దరు మహిళలు, వార్డులో ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీల నుంచి ఒక్కొక్కరి చొప్పున సభ్యులు ఉండగా.. వార్డు ఆఫీసర్ కన్వీనర్‌గా ఉంటారని మున్సిపల్ కమిషనర్ ఇటీవల ప్రకటించారు. అయితే పట్టణంలోని 49 వార్డుల్లో స్థానిక వార్డు కౌన్సిలర్ సూచించిన వారిని కాకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారి పేర్లను కమిటీలో చేర్చడంపై బీఆర్ఎస్ కౌన్సిలర్లు పిట్ల వేణు, అంజల్ రెడ్డి, గెరిగంటి స్వప్న, నజీరుద్దీన్, భాస్కర్ గౌడ్, హఫీజ్‌తోపాటు మరికొందరు అభ్యంతరం వ్యక్తంచేశారు. 43వ వార్డుకు చెందిన మాజీ వైస్ చైర్మన్ మసూద్ అలీ.. 25వ వార్డు కమిటీలో ఎలా ఉంటాడని స్థానిక వార్డు కౌన్సిలర్ అంజల్‌రెడ్డి ప్రశ్నించారు. తన వార్డులో మొత్తం కాంగ్రెస్ నాయకుల పేర్లు చేర్చారని 47వ వార్డు కౌన్సిలర్ కమిషనర్‌ను నిలదీశారు. ఇన్‌చార్జి మంత్రి ఆదేశాల మేరకు పేర్లను మార్చినట్లు కమిషనర్ సమాధానం ఇచ్చారు. దీంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు కలెక్టరేట్‌కు తరలివెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

'పత్తా' తీశారు..
మెమో జారీచేశారు

- నాగిరెడ్డిపేట వసతిగృహ వాచ్‌మన్ తొలగింపు
- వార్డెన్ రాములుకు మందలింపు

వసతిగృహంలో వార్డెన్ రాములు, వాచ్‌మన్ అన్వర్‌ను విచారిస్తున్న జిల్లా అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 17 : నాగిరెడ్డిపేటలోని వసతిగృహంలో పత్తాలేకుండా పోయిన అధికారులు, సిబ్బందిపై వేటుపడింది. వసతి గృహ వార్డెన్‌కు ఉన్నతాధికారులు మెమో జారీచేయగా..వాచ్‌మన్‌ను విధుల నుంచి తొలగించారు. దసరా సెలవుల అనంతరం కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే బుధవారం వసతిగృహానికి రాగా..అధికారులు, సిబ్బంది పత్తాలేకుండా పోయారు. దీంతో విద్యార్థులు భయాందోళనలకు గురికాగా..స్థానికుల సాయంతో వారి బంధువులకు అప్పగించారు. ఈ ఉదంతంపై నమస్తే తెలంగాణ దినపత్రికలో 'పత్తా లేని హాస్టల్ సిబ్బంది' శీర్షికన ఈ నెల17న వార్త ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్, డీఎస్ఈడీవో రజిత స్పందించారు. వారి ఆదేశాల మేరకు జిల్లా అసిస్టెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్ గురువారం వసతిగృహాన్ని సందర్శించారు. బుధవారం రాత్రి జరిగిన ఘటనపై వార్డెన్ రాములు, వాచ్‌మన్ అన్వర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాచ్‌మెన్ అన్వర్ మతి స్థిమితం సక్రమంగా లేకపోవడంతో ఆయనను ఇక్కడ విధుల నుంచి తొలగిస్తున్నామని, మరోచోటికి పంపడంపై జిల్లా అధికారిణి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. వార్డెన్ రాములుకు మెమో జారీ చేసినట్లు చెప్పారు.

ఆర్మూర్ ఎమ్మెల్యేపై
కఠిన చర్యలు తీసుకోవాలి

- హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యానించారని పోలీసుస్టేషన్లలో బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్/ నందిపేట్, అక్టోబర్ 17: హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిపై ఆర్మూర్, నందిపేట్ పోలీసుస్టేషన్లలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు గురువారం ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పదవిలో ఉంటూ మతపరమైన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ సమాజంలో అశాంతి వాతావరణం సృష్టిస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. హిందువులను దుర్భాషలాడుతూ మనోభావాలను దెబ్బతీసేలా ఆయన చేసిన వ్యాఖ్యలతో భవిష్యత్తులో లా అండ్ ఆర్డర్ సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే హిందూ సమాజానికి ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పి, పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు పూజా నరేందర్, నాయకులు గంగాధర్, పృథ్వీరాజ్, అగ్గు క్రాంతి, శ్రవణ్, మచ్చర్ల సాగర్, వెల్మల్ రాజన్న, బాలగంగాధర్, సురేందర్, ప్రవీణ్, రవి, రాజేశ్వర్, రాజేందర్ ఉన్నారు.

పైడి రాకేశ్‌రెడ్డి రాజీనామా చేయకుంటే ఇంటిని ముట్టడిస్తాం..

హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఉత్తర తెలంగాణ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి డిమాండ్ చేశారు. గురువారం ఆమె విలేకరుల తో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పాలన్నారు. క్షమాపణలు చెప్పకపోతే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అర్ధరాత్రి వర్షం.. తడిసిన ధాన్యం

- కొనుగోలు ప్రక్రియ ఆలస్యం
- ఆందోళనలో రైతాంగం

గోపాల్‌పేట కొనుగోలు కేంద్రం వద్ద తడిసిన ధాన్యం కుప్పను చూపుతున్న యువరైతు

లింగంపేట/ నాగిరెడ్డిపేట్, అక్టోబర్17: కొన్నిరోజులుగా అకాల వర్షం రైతులను ఆగమాగం చేస్తున్నది. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో వర్షం కురుస్తుండడంతో కోతకు వచ్చిన పంట దెబ్బతినగా..కొన్నిచోట్ల ఆరబెట్టిన ధాన్యం తడిసిపోతున్నది. బుధవారం అర్ధరాత్రి, గురువారం కురిసిన వర్షానికి లింగంపేట, నాగిరెడ్డిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో కల్లాల్లోపాటు కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురువుతున్నారు. ధాన్యం తడవకుండా ఉండడానికి రైతులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. పదిరోజుల క్రితం నుంచి కోతలు మొదలైనా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. కేంద్రాలు ప్రారంభించేనాటికి ధాన్యం ఆరుతుందని ఆశ పడిన రైతులకు వర్షం తీరని నష్టం కలిగిస్తున్నది. కొన్నిగ్రామాల్లో కేంద్రాలను ప్రారంభించినా కొనుగోలు ప్రక్రియలో జాప్యం నెలకొంటున్నది. దీంతో ఆరబెట్టిన ధాన్యం తడవకుండా రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లింగంపేట మండలంలోని శెట్పల్లి, పర్మళ్ల, భవానీపేట, ముంబాజీపేట, బోనాల్, మెంగారం, పోతాయిపల్లి, లింగంపల్లి, పోల్కంపేట, శెట్పల్లిసంగారెడ్డి తదితర గ్రామాల్లో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసినట్లు రైతులు తెలిపారు. అధికారులు వెంటనే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం ప్రారంభించాలని కోరుతున్నారు.



లింగంపేట మండలకేంద్రంలోని కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

మాదకద్రవ్యాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

- నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, అక్టోబర్ 17 : జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధితశాఖల అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశంలో సీపీ కల్మేశ్వర్ సింగేనవార్‌తోపాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై సమావేశంలో చర్చించి, వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సూచనలు చేశారు. జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. గంజాయి విక్రేతలతో పాటు దానిని వినియోగించే వారికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల వినియోగంతో కలిగేఅనర్థాలపై ప్రజలు, విద్యార్థులకు వివరిస్తూ విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. గతేడాదితో పోలిస్తే జిల్లాలో ఈసారి గంజాయి కేసులు కొంతవరకు తగ్గాయని సీపీ కల్మేశ్వర్ తెలిపారు.